క్లుప్తంగా

నేటి నుంచి మీకోసం కార్యక్రమం

యద్దనపూడి: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం స్థానంలో ప్రతి సోమవారం మీకోసం-పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని తహశీల్దారు నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్చి నుండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం నిలిపివేశారన్నారు. మళ్లీ రాష్ట్రంలో ఏర్పాడిన కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. అలాగే పీజీఆర్ఎస్ సార్వత్రిక ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్ 1902 కూడా కాల్ చేయవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలు స్వీకరిస్తామని తహశీల్దారు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభం


అలంకరణలో స్వామివారు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానం 40వ వార్షిక బ్రహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. స్వామి వారిని ప్రత్యేక అలంకారం చేసిన ఆలయ కమిటీ సభ్యులు అంకుర్పాణ గావించారు. 24వ తేదీ స్వామివారికి అష్టదళ పాదపద్మారాధన సేవ, 25న పుష్పాలంకరణ సేవ, 26న చందనాలంకరణసేవ, 27న 108కలశాల పాలతో క్షీరాభిషేకం, 28న స్వామివార్లకు దివ్య కళ్యాణం నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి రోజూ సాయింత్రం 6గంటల నుంచి స్వామివారు వివిధ రకాల వాహనాలపై ఊరేగుతూ గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


విద్యార్థులు చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్


నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సంఘ సభ్యులు

వేటపాలెం: పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు సూచించారు. స్థానిక జీవీకేసీ ఎయిమ్ ఫర్ సేవా వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మస్తాన్‌రెడ్డి, నాగాంజనేయులు, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్‌తో జాగ్రత్త

- దేశవ్యాప్తంగా సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహనలు
- వ్యాధి తీవ్రత, లక్షణాలు, నివారణలపై డాక్టర్ హస్మప్రియ సలహాలు



కారంచేడు: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో డబ్బు సంపాదనకై ఎంతో కష్టపడుతున్నారు. మంచిదే కాని.. అదే మనకు చెడ్డ అవుతోంది. ఎంత ఆరోగ్యాన్ని కాపాడుకుంటే అంతమంచిదంటున్నారు వైద్యులు. 2047 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సికిల్ సెల్ (కొడవలి కణాలు) ఎనీమియా(రక్తహీనత) నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంబించింది. ఈ నెల 19వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహించే డ్రైవ్ ద్వారా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఈ సికిల్ సెల్ వ్యాధి తీవ్రత ఎలా ఉంటుంది, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సి జాగ్రత్తలపై కారంచేడు మండలం స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ హస్మప్రియ సలహాలు ఇస్తున్నారు. ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 సంవత్సరాల వయస్సున్న సుమారు 7 కోట్ల మంది ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించడం, సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డాక్టర్ తెలిపారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

- రక్త కణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత)
- కళ్లు పసుపు రంగులోకి మారడం
- తీవ్రమైన ఒళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు
- అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు
- గర్భధారణ సమయంలో సమస్యలు
- అవయవ నష్టం (అంగవైఫల్యం)

సికిల్ సెల్ ఎనీమియా నొప్పి సంక్షోభం అంటే..

- చాలా మంది పిల్లలు, పెద్దలు నొప్పి సంక్షోభాన్ని కలిగి ఉంటారు. వీపు, కాళ్లు, ఛాతీలలో తీవ్రమైన నొప్పులుంటాయి.
- వాతావరణంలో మార్పులు, విరేచనాలు, జ్వరం, నిర్జలీకరణం, ఇన్ఫెక్షన్లు, ఒత్తిడి, అలసటలు ఉంటాయి.
- నొప్పి సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, వికారం, అవయువ వైఫల్యం వంటి లక్షణాలుంటాయి.
- ఇది అత్యవసర పరిస్థితి.. ఇలాంటప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి

ఎనీమియా లక్షణాల నిర్వహణ..

లక్షణాలు లేకపోయినా క్రమం తప్పకుండా సలహాల మేరకు ప్రత్యేక వైద్యులను సంప్రదించాలి.

- శరీరంలో తగినంత నీటి శాతం పాటించాలి, తరచుగా నీరు తాగాలి.
- డాక్టర్ సలహాలతో మందులు వాడాలి.
- సమతుల ఆహారం, పౌష్టికాహారం తీసుకోవాలి
- విపరీతమైన వాతావరణ పరిస్థితుల్లో ఉండకూడదు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి అంటే ఏమిటి.. ?

- సికిల్ సెల్ వ్యాధి అనేది వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహం. ఇక్కడ మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయి.
- రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్తుంది. లోపభూయిష్ట జన్యువులతో హిమోగ్లోబిన్ కొడవలి కణాలు ఆక్సిజన్ తీసుకెళ్లే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. తగినంత మొత్తంలో ఆక్సిజన్ లేక పోవడంతో శరీరంలోని ఏ భాగంలోనైనా అవయవ నష్టానికి దారితీస్తుంది.
- సాధారణ రక్త కణాలతో పోలిస్తే సికిల్ సెల్ దృఢంగా ఉంటాయి. అటువంటి కణాల బిగుతు, అసాధారణ ఆకారంలో శరీరంలోని చిన్న రక్త కణాల ద్వారా కదిలే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. ఇది రక్త ప్రవాహంలో అడ్డంకిని సృష్టిస్తుంది. దాని ద్వార తీవ్రమైన నొప్పులను కలిగిస్తుంది.
- సికిల్ సెల్ కణాలు తక్కువ జీవిత కాలం కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో రక్తకణాల పరిమాణం తగ్గడానికి దారితీస్తుంది. రక్తహీనత అని పిలువబడే పరిస్థితికి తీసుకొస్తుంది.
- తల్లిదండ్రులు ఇద్దరి నుంచి లోపభూయిష్ట జన్యువులు వచ్చినప్పుడు అది సికిల్‌సెల్ ఎనీమియా అని పిలువబడే తీవ్రమైన వ్యాధికి దారి తీస్తుంది.
- తల్లిదండ్రుల్లో ఒకరి నుంచి ఎవరైనా లోపభూయిష్ట జన్యువును పొందినప్పుడు, వ్యాధి వాహకంగా మారవచ్చు. ఈ పరిస్థితినే సికిల్ సెల్ వ్యాధి లక్షణాంశం అంటారు.

సికిల్ సెల్ వ్యాధి ఎలా వస్తుంది.. ?

- సికిల్ సెల్ అంటు వ్యాధి కాదు. ఒక వ్యక్తికి గాలి, నీరు, చర్మం వంటి వాటి ద్వార వ్యాధి సోకదు.
- ఆహారపు అలవాట్ల ద్వార సంభవించదు. జన్యుపరంగా మాత్రమే వస్తుంది.
- ఏ జాతి సమూహంలోనైనా ప్రజలు సికిల్ సెల్ కణ లక్షణాలు, వ్యాధులు కలిగి ఉండవచ్చు. బారత దేశంలో 17 రాష్ట్రాలలో సికిల్‌సెల్ కణవ్యాధి ఎక్కువగా ఉంది. ఇవి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది.
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ సికిల్ సెల్ కణం అంటే ఏమిటో తెలుసుకోవాల్సి ఉంది. అవగాహన కలిగి ఉండటమే సాధికారత సాదించడం. సాధారణ రక్త పరీక్షలతో దీనిని నిర్ధారించవచ్చు.
- సికిల్ సెల్ వ్యాధి జీవితకాల వ్యాధిగా ఉంటుంది. దీనిని సరైన వైద్యం, వైద్యేతర సంరక్షణలతో ఇబ్బంది లేకుండా చూసుకోవచ్చు. సకాలంలో గుర్తించి సరైన వైద్యం అందించడంతో రోగి జీవన నాణ్యతను మెరుగుపరచవచ్చు.


డాక్టర్ హస్మప్రియ

ఎప్పుడు, ఎందుకు పరీక్షించుకోవాలి.. ?

- ఈ వ్యాధి సకాలంలో నిర్ధారించడం వలన చికిత్సను వెంటనే ప్రారంభించవచ్చు. ఎనీమియా వ్యాధి ఉండటం యాదృచ్ఛికం కాబట్టి ఆరోగ్యంను రక్షించుకొనేలా ప్రతి ఒక్కరూ పరీక్షించుకోవాలి.
- సికిల్ సెల్ ఎనీమియా భవిష్యత్తులో పుట్టబోయే బిడ్డలకు సంక్రమించకుండా నివారించడానికి చాలా ముఖ్యం.
- రాబోవు తరాలకు వ్యాధి సోకకుండా నివారించవచ్చని ఆమె తెలిపారు.

పోలేరమ్మతల్లి కొలుపులకు అంకురార్పణ


తిరునాళ్లకు ముస్తాబవుతున్న పోలేరమ్మ ఆలయం


అలంకరణలో పోలేరమ్మ తల్లి


అలంకరణలో పోతురాజు


మొక్కుబడి ప్రభ

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో పోలేరమ్మతల్లి కొలుపులకు ఆదివారం అంకురార్పణ చేశారు. గ్రామానికి ఆగ్నేయ భాగంలో వేంచేసిఉన్న పోలేరమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి ఆలయంలోని అమ్మవారిని ఆమెకు ఎదురుగా రక్షణగా ఉన్న సోదరుడు పోతురాజును ప్రత్యేకంగా అలంకరించారు. కొలుపల్లో భాగంగా బంధుమిత్రులు గ్రామానికి చేరటంతో ప్రతి ఇంటా పండగవాతావరణం నెలకొంది. కొలుపుల్లో భాగంగా బొల్లి ఆవులతో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మూడు రోజులపాటు మంగళవారం వరకు ఈ వేడుకలు కొనసాగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారాలో అంకమ్మతల్లి కొలుపులు నిర్వహించనున్నారు. కొలుపులు ముగింపులో భాగంగా శుక్రవారం అన్నసంతర్పణ చేపట్టనున్నారు. 5 రోజుల పాటు జరిగే వేడుకల్లో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు గుంటుపల్లి పోలేరమ్మ తిరునాళ్ల..

మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న సట్టు పోలేరమ్మ తల్లి మూడో వార్షిక తిరునాళ్ల సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వేడుకల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచే అమ్మవారికి కుంకుమ పూజలు, దేవాలయ ప్రాంగణంలో ఉన్న వివిధ ఉపాలయాల్లో పూజలు, ప్రత్యేక అలంకరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఏర్పాట్లలో భాగంగా రాత్రికి భారీ ఎలక్ట్రిక్ ప్రభ, మొక్కుబడి ప్రభలతో సాంస్కృతి కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకలకు సంబంధించి ఆలయాన్ని ఉపాలయాలను ముస్తాబుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈవేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటి కోరింది.

గానాల రామ్మూర్తి సేవలు మరువలేనివి


ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ నాయకులు

అద్దంకి రూరల్: విశ్వబ్రాహ్మణలకు రాజకీయ ప్రాముఖ్యత కల్పించిన గానాల రామూర్తి 88వ వర్ధంతిని ఆదివారం ఉమ్మడి ప్రకాశం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అద్దంకిలోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు గానాల రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆపరేషన్ చేయించుకున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం, నాగంపల్లి గ్రామ వాసి దొడ్డేటి రామూర్తి వైద్య ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అభ్యర్థన మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు రూ. 69,066 సేకరించి బాధితురాలి భార్య రాజేశ్వరికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంచర్తి సీతారామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, జిల్లా మహిళా అధ్యక్షురాలు గోనుగుంట రజిని, తవ్వపాటి జనార్దనాచారి, అద్దంకి కార్యదర్శి ఏలూరి వీరబ్రహ్మచారి, ఏజెండ్ల ఆంజనేయులు, చెన్నుపల్లి కోటిలింగాచారి, ఆళ్లగడ్డ వీర సుందరాచారి, బొప్పుడి వీరప్పయ్య, అద్దంకి మహిళా కార్యదర్శి బాణాల లలిత, సంఘ నాయకులు పాల్గొన్నారు.

రిసార్ట్స్ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి


రిసార్ట్స్ యజమాన్యాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: సముద్రతీరంలోని రిసార్ట్స్‌కు వచ్చే పర్యాటకులకు రిసార్ట్స్ నిర్వాహకులు వారికి పలు సూచనలు చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రిసార్ట్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సముద్రతీరంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాల కారణంగా ఎంతో మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రిసార్ట్స్‌లో విడిది చేసి సముద్రస్నానాలకు వెళ్లే వారికి తగు సూచనలు చేయాలన్నారు. సముద్రంలో లోతు ప్రాంతాలకు వెళ్ల వద్దని, అలల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో సముద్రంలోకి వెళితే ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాలను అరికట్టకడం కష్టతరమవుతుందన్నారు. రిసార్ట్స్ యాజమాన్యాలు కూడా తమ వంతుగా తమ రిసార్ట్స్‌లో విడిది చేసే వారికి తగు జాగ్రత్తలు చేయడం వలన మరణాలు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, టూటౌన్ సీఐ సోమశేఖర్, ఎస్సైలు పాల్గొన్నారు. అనంతరం మంగళగిరికి చెందిన యువకులు వేటపాలెం మండలం రామాపురం సముద్రతీరంలో గల్లంతై మృతి చెందిన చేయడంతో మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. చీరాల పట్టణంలో హత్యకు గురైన సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

యువతి కుటుంబానికి న్యాయం చేయాలి


యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శంకరరావు

చీరాల: హత్యాచారానికి గురైన సుచరిత కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకుని న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన యువతి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబంలోని బాధితురాలి చెల్లెలికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, సొంత ఇల్లు లేని ఆ కుటుంబానికి నివేశన స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. బాధితురాలి చెల్లెలి చదువు నిమిత్తం అవసరమైన ఖర్చులను తమ సంఘం భరిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ హామి ఇచ్చారు. ఆ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. అనంతరం రామాపురం బీచ్‌లో గల్లంతై మృతిచెందిన మృతదేహాలను ఏరియా ఆస్పత్రి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన యువకుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీను, జిల్లా న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే రామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 984 మంది ఈ ఉచిత షుగరు వైద్య శిమిరానికి హాజరు కాగా వీరికి వైద్యులు రాజ రాజేశ్వరి, పేట శ్రీకాంత్, సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆశ్రమం మేనేజర్ సురేష్ మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ల నుంచి సమాజాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన భారీ ఎత్తున ప్రజలు

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

పుస్తకాలతో మెరుగైన విజ్ఞానం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి): పుస్తకాలు చదవటం విద్యార్థి దశనుంచే అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు శాఖగ్రంథాలయం లైబ్రేరియన్ బాదం విజయ భాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే నీతికథలు, జాతీయ నాయకులు చరిత్రలను చదివించారు. ఈ కార్యక్రమంలో 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లలిత కళాసమితి వార్షికోత్సవం


మాట్లాడుతున్న గొల్లపూడి సీతారాం

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణలో లలిత కళా సమితి 72వ వార్షిక వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సమితి గౌరవ అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం మాట్లాడుతూ ప్రస్తుత ఆదునిక కాలంలో కళలు అంతరించి పోతున్నాయన్నారు. నాటక రంగం పూర్తిగా కనమరుగయిందన్నారు. అయినప్పటికి 72 సంవత్సరాలుగా లలిత కళా సమితి ద్వారా కళలను ప్రోత్సహిస్తూ కళాకారుల సన్మానిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారి వీ మనుశ్రీ ప్రదర్శించిన భరత నాట్యం ఆహుతులను ఆకట్టుకుంది. తిరుమల, తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే అన్నమాచార్య సంకీర్తనాలు విభావరి నిర్వహించారు. చివరగా వివిధ కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి శాశ్వత కన్వీనర్ లొల్లా శ్రీరామూర్తి, కో కన్వీనర్ జి రవిబాబు, గౌరవాధ్యక్షులు సత్రం మల్లేశ్వరరావు, లోల్లా నిరంజన్ పాల్గొన్నారు.

'నా జీవన కవిత' కవితాసంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: బండ్ల తారకష్ రచించిన 'నా జీవన కవిత' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి సహజ సాహితి సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు, రచయిత వడలి రాధాకృష్ణ సభా నిర్వహణ చేశారు. సభాధ్యక్షుడిగా అందె మురళీవరప్రసాద్ వ్యవహరించగా ముఖ్యఅతిథిగా సింహాద్రి యలమందారెడ్డి హాజరయ్యారు. కవితా సంపుటిని నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కమిలిశ్రీ ఆవిష్కరించారు. కవితా సంపుటి సమీక్షను కవి మంత్రి కృష్ణమోహన్ నిర్వహించారు. అనంతరం అందె మల్లికార్జునరావు, ఆదిలక్ష్మి స్మారక సాంస్కృతిక సేవా పురస్కారాన్ని నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకులు కమిలిశ్రీకి అందె మురళీవరప్రసాద్ అందించారు. కార్యక్రమంలో బూసం ఉమామహేశ్వరరావు, బండ్ల జయశ్రీ, గాదె హరిహరరావు, చిత్రాడ కిషోర్‌కుమార్, లేళ్ళ కృష్ణమూర్తి, భాగి కృష్ణమూర్తి, గుత్తి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

పంగులూరు: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పంగులూరు గ్రామంలోని రోటరీక్లబ్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిభిరానికి విశేషస్పందన లభించింది. శిబిరంలో 380 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 220 మందిని కంటి శుక్లాల ఆపరేషన్‌కు వైద్యులు ఎంపిక చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కరణం హనుమంతరావు, కాలేషావలి, శంకర కంటి వైద్యశాల పెదకాకాని వైద్యులు ఎం.వెంకటేశ్వర్లు, రోటరీక్లబ్ సభ్యులు బత్తుల వీరనారాయణ, పోలిశెట్టి సీతారామయ్య, జగదీశ్వరరావు, వెంకట రామారావు, పోతిని ప్రసాద్, సుబ్బారావు, చిలుకూరి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

చినగంజాం: మండలంలోని పెదగంజాం గ్రామంలో ఆదివారం పోలేరమ్మ కొలుపులను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలైన పోలేరమ్మ అంకమ్మతల్లి జాలమ్మతల్లి అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించారు. ఇందులో భాగంగా భక్తులు కలశాలతో నీటిని తీసుకుని వెళ్లి అమ్మవార్లకు జలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులంతా సద్ది వడపప్పు, పానకం వెంట తీసుకొని వెళ్లి అమ్మవారిలకి తమ మొక్కలు చెల్లించి ఘనంగా కొలుపులు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ప్రత్యేకంగా ప్రభను నిర్మించి అలంకరణలు చేసి వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు